

జాతీయ సమైక్యత చాటి చెప్పేలా..

## గణతంత్ర వేడుకల ఏర్పాట్లు

2 లో

18వ వసంతంలోకి...
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ - కృష్ణా
మంగళవారం 21 జనవరి 2025 పేజీలు 8




# స్వచ్ఛ దివస్... ఇదేనా?



- పాముల కాలువ కోడి పందాల బరిలో కుప్పలు తెప్పలుగా చెత్త వ్యర్థాలు
- కోడిపందాలు ఆడించిన నిర్వాహకులు జంప్
- అనుమతినిచ్చిన అధికారులు గప్ చిప్
- ఖాళీ ప్రదేశంలో క్లీనింగ్ బాధ్యత ఎవరిది?
- చుట్టుపక్కల కాల్వల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు తిని అనారోగ్యాల పాలవుతున్న పశువులు

వివరాలు 2లో

## ప్రకృతి వైపరీత్యాలను సైతం తట్టుకునే పంట ఆయిల్ పామ్

**సాగు పట్ల రైతులకు అవగాహన కార్యక్రమాలు : కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**



**మొవ్వ/పామర్రు, జనవరి 20, మేజర్ న్యూస్** : ప్రకృతి వైపరీత్యాలను సైతం తట్టుకుని రైతులకు లాభాలను ఇచ్చే పంట ఆయిల్ పామ్ సాగు అని, ఆ సాగు వైపు రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన స్థానిక శాసనసభ్యుడు వర్ల కుమార్ రాజాతో కలిసి పామర్రు నియోజకవర్గంలోని మొవ్వ, పమిడిముక్కల మండలాల్లో పర్యటించి ఆయిల్ పామ్ మొక్కల నర్సరీ, పంట సాగును క్షేత్రస్థాయిలో సందర్శించారు. మొవ్వ మండలములోని కొండవరం గ్రామంలో కొసరాజు వెంకటలక్ష్మి దాసు అనే రైతు 13 ఎకరాలలో సాగుచేసిన ఆయిల్ పామ్ సాగు పంటను, అదేవిధంగా సాగులో అంతరపంటగా వేసిన మినుము పంటను ఆసక్తిగా పరిశీలించారు. సాగుకు సంబంధించిన వివరాలను రైతుతో పాటు అధికారులు, కంపెనీ ప్రతినిధుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పమిడిముక్కల గ్రామంలో ఏర్పాటు చేసిన

మిగతా 2లో...

## మధ్యాహ్న భోజన పథకం పరిశీలన



వివరాలు 8లో...

# స్వర్ణ భారత్ ట్రస్ట్‌లో నైపుణ్య శిక్షణ పొందుతున్న యువకులతో ముఖాముఖీ



గన్నవరం (ఉంగుటూరు), జనవరి 20, మేజర్ న్యూస్ : ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణ భారత్ ట్రస్ట్ లో నైపుణ్య శిక్షణ పొందుతున్న యువతీ యువకులతో ఏర్పాటు చేసిన ముఖా ముఖిలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుతో కలసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ మహనీయులు జన్మించిన గడ్డ కృష్ణాజిల్లా అని అలాంటి జిల్లా ఏడు నియోజకవర్గాలకు పరిమితం అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహనీయుల విగ్రహాలను కృష్ణాజిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేయకపోతే జిల్లా పరిషత్ సమావేశాలకు హాజరుకానని చెప్పారు. మల్లవల్లి పారిశ్రామికవాడకు 420 పరిశ్రమలు వస్తున్నట్లు ఆయన తెలిపారు. మల్లవల్లి ఇండస్ట్రియల్ కారిడార్ లో పరిశ్రమల స్థాపన కోసం 183 కంపెనీలు స్థలాలు కేటాయించాలని ఏపీఐఐసీ అధికారులకు దరఖాస్తు

## మల్లవల్లి ఇండస్ట్రియల్ కారిడార్‌లో 420 పరిశ్రమలు

చేసినట్లు వెల్లడించారు. రానున్న రోజుల్లో ఒక్క గన్నవరం నియోజకవర్గం నుంచే యువతకు 50 వేల ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. నియోజకవర్గంలో 15 వేల మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని లేని పక్షంలో రాజకీయాలలో కొనసాగనని చెప్పానని అందుకు తగ్గట్లుగానే ఉద్యోగాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఉద్యోగ మేళా నిర్వహించి పలువురికి హెచ్సీఎల్ లాంటి కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించామని.... ఈ నెల 28 వ తేదీన అమర్ రాజా కంపెనీ వారితో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో మల్లవల్లిలో పరిశ్రమలు స్థాపించి వెనక్కి వెళ్లిపోయిన సంస్థలను తిరిగి తీసుకువస్తున్నామని యార్లగడ్డ పేర్కొన్నారు. అశోక్‌లేలాండ్ సంస్థ ఇప్పటికే బాడీ బిల్డింగ్ యూనిట్‌ని ప్రారంభించనుందని, ఫిబ్రవరి లో అది ప్రారంభం అయ్యే అవకాశం ఉందని చెప్పారు. తమిళనాడు రాష్ట్రంలోని హోసూరు పారిశ్రామికవాడ తరహాలో మల్లవల్లి పారిశ్రామికవాడ కూడా అభివృద్ధి చెందుతుందని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించాలన్నదే తన ఆకాంక్ష అని త్వరలోనే మల్లవల్లి పరిశ్రమలతో కళకళలాడేలా తీర్చిదిద్దే బాధ్యతను తాను తీసుకుంటున్నానని ఎమ్మెల్యే యార్లగడ్డ వెల్లడించారు.

# అగ్ని ప్రమాద బాధితులకు బెరాకా మినిస్ట్రీస్ సంస్థ అధినేత డాక్టర్ కిరణ్ పాల్ చేయూత



మచిలీపట్నం మేజర్ న్యూస్ : అగ్ని ప్రమాద బాధితులకు బెరాకా మినిస్ట్రీస్ సంస్థ మరోసారి అప్పన హస్తం అందించింది. గుడ్లవల్లేరు మండలం వడ్లమన్నాడు గ్రామంలో జంగం ముసలయ్య, జంగం శ్రీనివాసరావు, నత్తా సుబ్బారావు, మాసవరపు రోశయ్యల (నలుగురు) గృహాల దగ్గరలో ఉన్న ట్రాన్స్ఫార్మర్ షార్ట్ సర్క్యూట్ అయ్యి పూర్తిగా కాలి పోయి, కట్టు బట్టలతో నిరాశ్రయులయిన ప్రమాద బాధితులకు అండగా మేమున్నాం అంటూ బెరాకా మినిస్ట్రీస్ సంస్థ అధినేత డాక్టర్ బి.ఎస్ కిరణ్ పాల్ మరో మారు తన సహృదయతను చాటారు. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన కుటుంబాలకు చేయూత అందించారు. సోమవారం మచిలీపట్నం లోని బెరాకా మినిస్ట్రీస్ సంస్థ కార్యాలయంలో అధినేత డాక్టర్ బి. ఎస్.కిరణ్ పాల్ ని ఆ గ్రామస్తులు కలిసి తమ స్వగ్రామంలో నలుగురు ఇళ్లు పూర్తిగా కాలిపోయి నిరాశ్రయుల య్యారని కిరణ్ పాల్ దృష్టికి తీసుకువచ్చారు. వారికి సహాయం చేయమని అడగగా కిరణ్ పాల్ వెంటనే స్పందించి ప్రమాద బాధితులకు వెంటనే నిత్యావసర సరుకులు, వంట పాత్రలు, భోజనం చేయుటకు ప్లేట్లు, గ్లాసులు, రెండు షోలాపూర్ దుప్పట్లు, ఒక చీర, ఒక లుంగి, ఒక కండువా, సబ్బులు, 25 కేజీల బియ్యం బస్తాలు అందించి, తమ సంస్థ సహృదయతను చాటారు. ఆయనే స్వయంగా వడ్లమన్నాడు గ్రామంకి వెళ్లి బాధితులకు చేయూత అందించారు. వారికి బాధితుల తరపున వడ్లమన్నాడు గ్రామం తరపున హృదయ పూర్వక ధన్యవాదములు తెలిపారు. వారితో పాటుగా పెడన పాస్టర్స్ అసోసియేషన్ వారు నాగిశెట్టి దానియల్ పాస్టరు, ఉజ్జీవం పాస్టరు, శామ్యూల్ తదితరులు ఈ కార్యక్రమంలో ప్రధాన భూమిక పోషించినందుకు వీరికి కూడా గ్రామం తరపున హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు.

# అనాధలను చదివించి ప్రయోజకుల్ని చేసిన బెరాకా మినిస్ట్రీస్

## అధినేత డాక్టర్ బి.ఎస్.కిరణ్ పాల్



మచిలీపట్నం మేజర్ న్యూస్ : వాళ్ళిద్దరూ అనాధలు. బెరాకా మినిస్ట్రీస్ సంస్థ వారిని ఆదుకుంది. దగ్గరుండి చదివించింది. ఆపన్న హస్తం అందించింది. ప్రయోజకులైన వారిద్దరూ జీవితంలో స్థిరపడ్డారు. స్థిరపడ్డ వారిద్దరూ ఒకరి మనసు ఒకరు తెలుసుకొని వివాహం చేసుకోవాలనుకున్నారు. అనుకున్నదే తడవుగా విషయాన్ని తమ సంస్థ అధినేత డాక్టర్ బి.ఎస్. కిరణ్ పాల్ కి తెలియజేశారు. తమ సంస్థ ద్వారా చదువుకుని ప్రయోజకులను చేసిందే చాలనుకోకుండా ప్రయోజకులై జీవితంలో స్థిరపడ్డ ఆ ఇద్దరి మనసులు తెలుసుకొని వారికి వివాహం చేయాలనే మంచి సంకల్పంతో, బెరాకా మినిస్ట్రీస్ అధినేత డాక్టర్ బి ఎస్ కిరణ్ పాల్ ముందుకు వచ్చారు. తాను ముందుకు రావడమే కాక వారిద్దరికీ జీవితంలో ఏ విధమైన అరమరికలు లేకుండా అన్యోన్యంగా జీవించాలని, హితబోధ చేశారు. ఆ ఇద్దరూ ఒకరినొకరు అమితంగా ఇష్టపడుతున్నారని తెలుసుకున్నారు. వాళ్ళిద్దరికీ దగ్గరుండి పెళ్లి చేయాలని కిరణ్ పాల్ సంకల్పించారు. అనుకున్నదే తడవుగా బైరాగి పాలెం లోని తమ అనాథల వసతి గృహంలో విద్యను అభ్యసించిన రమ్య, కార్తీక్ లకు ఆదివారం రాత్రి దగ్గరుండి ఆయన వివాహం జరిపించారు. వాళ్లిద్దరూ అనాథలు కావడంతో బెరాక హాస్టల్లో వసతి సదుపాయాలు కల్పించి చదివించిన, ప్రయోజకుల్ని చేసిన కిరణ్ పాల్ సత్సంకల్పంతో వాళ్ళిద్దరికీ వివాహం చేశారు ప్రస్తుతం రమ్య, కార్తీక్‌లు హైదరాబాదులో ఉద్యోగాలు చేస్తున్నారు. జీవితంలో స్థిరపడ్డ వారిద్దరికీ దగ్గరుండి వివాహాలు చేసిన కిరణ్ పాల్ ని పలువురు అభినందించారు. కేవలం సేవా కార్యక్రమాలు, ప్రమాద బాధితులకు చేయూత, మెరిటోరియల్ విద్యార్థులకు చెక్కు ల పంపిణీ, ఇత్యాది కార్యక్రమాలే కాక, తమ బెరాకా వసతి గృహంలోనే చదివిన ఆ ఇద్దరు పూర్వ విద్యార్థులకు, వారు ప్రయోజకులయ్యాక, వారి మనసులు తెలుసుకొని, వారిద్దరినీ వివాహ బంధంతో ఏకం చేసిన కిరణ్ పాల్ సేవలను పలువురు కొనియాడారు. అంగరంగ వైభవంగా బెరాకా మినిస్ట్రీస్ సంస్థ హాస్టల్ ని విద్యుత్ దీప కాంతులతో అల్లరారేలా తీర్చిదిద్దారు. కళ్యాణ వేదికను అందంగా తీర్చిదిద్దడం జరిగింది. తమ బెరాకా మినిస్ట్రీస్ సంస్థ ద్వారా చేసిన ఈ వివాహానికి విశేష స్పందన లభించింది. ఈ వివాహ కార్యక్రమంలో మత పెద్దలు విజయరాజు, డానియల్, జెవిఆర్, దాని, వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.




## తైవాన్ ఎక్సెలెన్స్ ఐఎంటిఈఎక్స్ 2025లో విప్లవాత్మక మెటల్ ప్రాసెసింగ్ పరిష్కారాల విడుదల

విజయవాడ మేజర్ న్యూస్ : ఆవిష్కరణ, నాణ్యతలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తించబడిన చిహ్నమైన తైవాన్ ఎక్సెలెన్స్(టిఈ), యంత్రాల పనిముట్లు, తయారీ సాంకేతికత కొరకు దక్షిణ, ఆగ్నేయాసియాల ప్రీమియర్ ప్రదర్శన అయిన ఐఎంటిఈఎక్స్ 2025 వద్ద శాశ్వత ముద్రను వేసేందుకు సిద్ధమవుతోంది. ఈ నెల 23 నుండి 29 వరకు బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్ (బిఐఈసి)లో జరిగేలా అనుసూచిక చేయబడిన ఈ ప్రదర్శనలో 13 ప్రముఖ తైవాన్ కంపెనీలు పాల్గొనడంతో, భారతదేశం యొక్క తయారీ రంగాన్ని మార్చటానికి సిద్ధం చేయబడిన 17 కట్టింగ్ ఎడ్జ్ సాంకేతికతను ప్రదర్శిస్తూ తైవాన్ ఎక్సెలెన్స్ ప్రారంభానికి తయారుగా ఉంది.

## 25, 26 తేదీలలో సిద్ధాంత పండిత సభ

విజయవాడ , మేజర్ న్యూస్ : శ్రీ కంచి కామకోటి పీఠం జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతీ ఆదేశానుసారం ఈనెల 25,26 తేదీలలో కొలనుకొండలోని కంచి కామకోటిలో సిద్ధాంత పండిత సభ నిర్వహిస్తున్నట్లు కంచికామకోటి సర్వజ్ఞపీఠ ఆస్థాన సిద్ధాంతి విజయ సుబ్రహ్మణ్య సిద్ధాంతి తెలిపారు. ఈ సభలో ప్రధానంగా ఉత్తరాయణ ఆరంభ నిరూపణం అనే అంశంపై చర్చ జరుగుతుందని పేర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్నాటక, ముంబై తదితర రాష్ట్రాల నుంచి కొందరు ప్రత్యక్షంగానూ, మరికొందరు ఆన్లైన్ ద్వారా ను పాల్గొంటారని తెలిపారు. జ్యోతిష్య ఖగోళ పరిశోధనలపై ఆసక్తి కలిగిన పండితులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని లక్కావఝుల విజయ సుబ్రహ్మణ్య సిద్ధాంతి కోరారు. మరిన్ని వివరాలకు 9963732303 నెంబరు లో సంప్రదించాలని సూచించారు.

## టిడ్కో కాలనీ అభివృద్ధికి 250 కోట్లు కేటాయించాలి



గుడివాడ, మేజర్ న్యూస్ : టిడ్కో కాలనీ ఋణమాఫీ చేసి, అభివృద్ధికి 250 కోట్లు ప్రత్యేక గ్రాంట్ విడుదల చేయాలని కాలనీ వాసులు డిమాండ్ చేశారు. ఈ విషయమై కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సభ్యులు సోమవారం గుడివాడ ఆర్డిఓ ఆఫీసు వద్ద ధర్నా నిర్వహించి, ఏఓకు వినతి పత్రం అందుజేశారు. ఈ సందర్భంగా కమిటీ కార్యదర్శి బసవ అరుణ మాట్లాడుతూ ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా పేదవారికి ఋణమాఫి చేసి, ఋణ విముక్తులను చేయాలన్నారు. ఓవర్ హెడ్ ట్యాంక్ నుండి మంచినీరు వదలాలని, ఉప్పునీరు బోరు ప్రతి బ్లాక్ వద్ద వేయాలని, స్కూల్, హాస్పటల్, సచివాలయం, కళ్యాణ మండపం తదితర మౌలిక సదుపాయాలు కల్పిం చాలని డిమాండ్ చేసారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు విరమించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 15 వార్డు కమిటీ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## పరీక్షలు రాసిన విద్యార్థులకు అభినందనలు



పెడన, మేజర్ న్యూస్: స్థానిక బంగ్లా హైస్కూల్ కు చెందిన విద్యార్థిని విద్యార్థులు జవహర్ నవోదయ పరీక్షలు రాసిన సందర్భంగా వారిని ప్రత్యేకంగా అభినందించామని ఇంటర్మీడియట్ విద్య విశ్రాంత అధికారి మట్ట రాధాకృష్ణ మూర్తి తెలిపారు. ఈ మేరకు పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం భాగ్యలక్ష్మి,ఎస్ఎంసి చైర్మన్ సుధారాణి,వైస్ చైర్మన్ బాబు, అధ్యాపక సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.



## అర్జీల పరిష్కారంలో గడువు దాటిన అర్జీలపై, పెండింగ్ కోర్టు కేసులపై దృష్టి సారించాలి

### జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జాయింట్ కలెక్టర్ సోమవారం కలెక్టరేట్లో మీకోసం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసంలో పెండింగ్ అర్జీలపై జాయింట్ కలెక్టర్ సమీక్షిస్తూ గడువు దాటేదాకా ఉండకూడదని, గడువులోగానే అర్జీలు పరిష్కరించాలన్నారు. వివిధ శాఖలలో పెండింగ్ కోర్టు కేసులు సమీక్షిస్తూ కోర్టు తుది ఆదేశాలు అమలు పరచక పోవడంతో కోర్టు ధిక్కరణ కేసులు పడుతున్నాయని, ఆ విధంగా జరగకుండా పెండింగ్ కోర్టు కేసులపై దృష్టి సారించాలన్నారు. కోర్టు ధిక్కరణ కేసులలో ఇప్పటివరకు తీసుకున్న చర్యలు సమీక్షించి, కోర్టు ఆదేశాలు సకాలంలో అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని సందర్భాల్లో కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇస్తుందని, వాటిని కూడా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించుటకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. యువ ఓటర్లకు ఫోటో ఓటర్ కార్డుల పంపిణీ, వృద్ధ ఓటర్లను సన్మానించడం, కళాశాల విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించి ఓటు హక్కు యొక్క ప్రాముఖ్యత తెలియజేస్తూ ఓటర్లను చైతన్యవంతం చేయాలని అన్నారు.ఈనెల 26 గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించుటకు చర్యలు తీసుకోవాలని, జిల్లా కలెక్టర్ వారి ప్రసంగపాటం సిద్ధం చేయాలని, వివిధ శాఖలలో ఉత్తమ సేవలందించిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందించుటకు పేర్లు వెంటనే పంపాలని అధికారులకు సూచించారు. అనంతరం వైద్య ఆరోగ్య శాఖ కుష్టు వ్యాధి విభాగం ద్వారా కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమం పై ముద్రించిన పోస్టర్లు, కరపత్రాలను జాయింట్ కలెక్టర్ విడుదల చేశారు.జిల్లాలో కుష్టు వ్యాధి పట్ల అవగాహన కల్పించేందుకు ఇంటింటి సర్వే ఈరోజు నుండి ప్రారంభించి ఫిబ్రవరి 2 వరకు నిర్వహిస్తున్నట్లు, వివిధ శాఖల అధికారులు సహకరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ఎస్ శర్మిష్ట తెలిపారు. మీకోసం అర్జీలలో.బాపులపాడు మండలం ఓగిరాల గ్రామంలో తాగునీరు కలుషితం, మంచినీటి పథకం ఫిల్టర్ రిపేర్ చేయించాలని కొలువురు గ్రామస్తులు గ్రామపంచాయతీ సభ్యులు అర్జీ సమర్పించారు. గురజాడ గ్రామంలో జాతీయ రహదారి విస్తరణ రెండవ దశలో సేకరించిన తన భూమికి నష్టపరిహారం ఇంతవరకు అందలేదని, ఇప్పించాలని కోరుతూ పిసికే ప్రసాద్ తదితరులు అర్జీ సమర్పించారు.మొవ్వ మండలం పెదపూడి గ్రామానికి చెందిన పెదపూడి శ్రీనివాసరావు తనకు పిత్రార్జితంగా సంక్రమించిన భూమికి పట్టాదారు పాసుబుక్ మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కృత్తివెన్ను మండలం సీతనపల్లి గ్రామానికి చెందిన గాదం నాగేశ్వరరావు తన స్వార్జిత భూమిని రెవిన్యూ రికార్డుల్లో నమోదు చేయించాలని కోరుతూ అర్జీ ఇచ్చారు.బందరు ఆర్డిఓ కే స్వాతి, సివిల్ సప్లై డిఎం పద్మాదేవి, మెప్మా పిడి సాయిబాబు జాయింట్ కలెక్టర్ తో పాటు మీకోసం లో పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. జడ్పీ సీఈవో కె కన్నమనాయుడు, పంచాయతీరాజ్ ఎస్ఇ రమణ రావు, నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు, డ్వామా పిడి కె.వి శివప్రసాద్ యాదవ్, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.పద్మావతి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా పరిష్కార వేదికలో ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు



**నందిగామ, జనవరి 20, మేజర్ న్యూస్ :** విజయవాడలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ" ని నాగార్జున సాగర్ లాల్ బహుదూర్ కెనాల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కోట వీరబాబు, చందర్లపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మేకల సుధాకర్ చందర్లపాడు మండల తెలుగు దేశం నాయకులు బొందల రామకృష్ణ షేక్ సైదా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కొన్ని సమస్యలను తెలిపారు. 1 విజయవాడలో ప్రాజెక్టు కమిటీ కార్యాలయం ఏర్పాటు చేయాలని. 2. నందిగామలో డిస్ట్రిబ్యూటర్ కమిటీ కార్యాలయాల నిర్మాణమునకు నిధులు మంజూరు చేయాలని.3. నందిగామలో రైతు శిక్షణ కేంద్రానికి నిధులు మంజూరు చేయాలని.,.4. చందర్లపాడు గ్రామంలో డ్రైనలా,నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ ని నాయకులు కోరారు.

# అర్జీల పరిష్కారానికి అధికారులు తొలి ప్రాధాన్యత ఇవ్వండి

### జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు 144 అర్జీలు

### జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం ద్వారా అందిన అర్జీలను నిర్దేశ గడువులోగా పరిష్కరించే విధంగా అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ.. డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి పి.జ్యోతి తదితరులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో మొత్తం 144 అర్జీలురాగా వీటిలో రెవెన్యూకు సంబంధించి 43, ఎంఏయూడీకి సంబంధించి 60, పోలీస్ 8, పంచాయతీరాజ్ 7, సర్వే 4, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ 3, ఉపాధి కల్పన 2, అటవీ 2, హెల్త్ 2, హౌసింగ్ 2, ఇరిగేషన్ 2, ఏపీసీపీడీసీఎల్ 1, ఏపీఎస్ఆర్టీసీ 1, సిఇవో జిల్లా పరిషత్ 1, కో – ఆపరేటివ్ 1, పౌర సరఫరాలు 1, డ్వామా 1,విద్యా 1, గనులు అండ్ భూగర్భ శాస్త్రం 1, సోషల్ వెల్ఫేర్ 1, చొప్పున అర్జీలు వచ్చాయి. ఈ అర్జీలను నిర్దేశ గడువులోగా పరిష్కరించేందుకు కృషిచేయాలని కలెక్టర్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. వీటితో పాటు ఆన్‌లైన్‌లోను నమోదు అవుతున్న ఆర్జీలను ప్రతి రోజు పరిశీలించి పెండిరగ్ లేకుండా పరిష్కరించాలన్నారు. గడువులోగా పరిష్కారం కాని వాటికి తగిన కారణాలను ఆర్జీదారునికి వివరించాలన్నారు. గడువుతీరిన ఆర్జీల పెండింగ్ ఏ శాఖలోను నమోదు కాకూడదని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన 12 ఫిర్యాదులు



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ప్రజల సమస్యలను నిత్యం పరిష్కరించే దిశగా జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం ఉదయం ఇంచార్జి కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ నిర్వహించారు. ఈ సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అధికారులు 12 ఫిర్యాదులు అందుకున్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు అధికారులు స్వీకరించిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరిస్తామని ఫిర్యాదులు అందించిన ప్రజలతో అన్నారు. ఈ సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అత్యధికంగా పట్టణ ప్రణాళిక విభాగం లో 5 అందుకున్నారు, ప్రజారోగ్యం 1, ఇంజనీరింగ్ 5, రెవిన్యూ విభాగం లో 1, ఫిర్యాదులను అధికారులు అందుకున్నారు. ఈ సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్, చీఫ్ సిటీ ప్లానర్ జి వి జి ఎస్ వి ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి సృజన, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, సుపరింటెంగ్ ఇంజనీర్లు పి.సత్యనారాయణ, పి సత్య కుమారి, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, డీఎఫ్ఓ మాల్యాద్రి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.ఎస్.ఎస్ సోమశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# గ్రీవెన్స్ సెల్‌లో నమోదయ్యే ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలి





**పామర్రు జనవరి 20 మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నమోదయ్యే ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ డీకే బా లాజీ, స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజాతో కలిసి పామర్రు తాహసిల్దార్ కార్యాలయంలో ప్రజల నుండి స్వయంగా అర్జీలు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. ప్రతి అర్జీని నిశితంగా పరిశీలించి గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు పున రావృతం కాకుండా అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న అర్జీలను గడువులోగా పరిష్కరించాలన్నారు. అర్జీలు ఆన్లైన్‌లోను నమోదవుతుంటాయని, అధికారులు ఎప్పటి కప్పుడు వాటిని కూడా పరిష్కరించాలన్నారు. నమోదైన అర్జీలకు అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలన్నారు. పరిష్కారం కాని వాటికి తగిన కారణాలను తెలపాలన్నారు. ప్రతి అర్జీకి నిర్దిష్ట కాలప రిమితి ఉంటుందని, పరిమితి లోపు పరిష్కరించి అర్జీదారుల్లో నమ్మకం కలి గించాల న్నారు. అనంతరం అధికారులతో మాట్లాడి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలను నిశితంగా పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. ఈ కార్యక్రమంలో పామర్రు తహసిల్దార్ గూడ పాటి రవికాంత్, ఎండిఓ కె.జ్యోతి, రాష్ట్ర గౌడ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జ్ తాడిశెట్టి నరేష్ తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ కోసం నాలుగు గంటల పా టు నిరీక్షించిన అర్జీదారులు కాగా ఉదయం 10.30 గంటలకు ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమం ప్రారంభం అవుతుందని అధికారులు ప్రకటించడంతో నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల నుండి ప్రజలు పెద్దసంఖ్యలో పామర్రు రెవెన్యూ కార్యాలయానికి విచ్చేశారు. అయితే కలెక్టర్ మధ్యాహ్నం 2.45 గంటలకు రావడంతో ప్రజలు తీవ్ర నిరాశకు గురయ్యారు. రెవెన్యూ కార్యాలయం ప్రాంగణంలో షామియాన, కుర్చీలు మాత్రం వేసిన అధికారులు కనీసం మంచినీటి వసతి కూడా కల్పించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పెద్ద సంఖ్యలో అర్జీలు అందించేందుకు వచ్చిన మహిళలు సౌకర్యాలు లేకపోగా కనీసం తాగేందుకు కూడా నీరు లేకపోవడంతో రెవెన్యూ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని పమిడి ముక్కల, మొవ్వ, పామర్రు మండలాలలోని వివిధ కార్యక్రమాలలో పాల్గొని కలెక్టర్ ఆలస్యంగా రావడంతో ప్రజలు ఆకలితో అలమటించారు. ఆలస్యంగా వచ్చిన కలెక్టర్ పెద్ద సంఖ్యలో ఉన్న ప్రజల నుండి హడావుడిగా అర్జీలను స్వీకరించి వారు చెప్పేది కూడా పూర్తిగా వినకుండా పంపించి వేశారని అర్జీ దారులు బయటకు వచ్చి ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం నుండి తిండి తిప్పలు లేకుండా ఎంతో ఓర్పుతో సమస్య పరిష్కారం కో సం ఆశతో వేచి ఉన్నామని, కానీ కలెక్టర్ పూర్తి స్థాయిలో తమ సమస్యను వి నకుండానే పంపించి వేశారని అర్జీదారులు ఆవేదన చెందారు. ఉదయం నుం డి వేచి ఉన్నప్పటికీ కనీసం తాగునీటి సౌకర్యం కూడా కల్పించకపోవడం పట్ల అధికారులు తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరుత్సాహంగా వెనుదిరిగారు.

# "కుష్టు" వ్యాధిని సమూలంగా నిర్మూలిద్దాం..

**లి వ్యాధి నిర్ధారణ పరీక్షలను సద్వినియోగం చేసుకోండి : జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ**



**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** కుష్టు వ్యాధి నిర్మూలనలో భాగంగా ఈనెల 20వ తేదీ నుండి ఫిబ్రవరి 2వ తేది వరకు జిల్లాలో కుష్టు వ్యాధి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని ప్రజలు సద్విని యోగం చేసుకుని "కుష్టు" వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దాడంలో భాగస్వా మ్యం కావాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. జిల్లా కుష్టు నివారణ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించనున్న కుష్టు వ్యాధి పరీక్షలకు సంబంధించిన వాల్ పోస్టర్లను పోస్టర్లను, కరపత్రాలను సోమవారం స్థానిక పింగళి వెంక య్య సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కుష్టు వ్యాధి నివారణకు ప్రభుత్వ పరంగా వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అవసరమైన అన్ని చర్యలను తీసుకోవడం జరుగుతుందన్నారు. కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న రోగులను ముందుగానే గుర్తించి సకాలంలో వైద్య సహాయం అందించగలిగితే వ్యాధిని త్వరితగతిన నివారించవచ్చునన్నారు. కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్నవారికి వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు జనవరి 20వ తేది నుండి ఫిబ్రవరి 2వ తేది వరకు మెడికల్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. చర్మంపై స్పర్శ లేని మచ్చలు, చెవులు, వీపు, ఎదపై నొప్పి లేని బొడిపెలు, కనుబొమ్మలు రెప్పల వెంట్రుకలు రాలిపోవడం, కనురెప్పలు మూతపడకపోవడం, ముక్కు దిబ్బడ, ముక్కు నుండి రక్తం కారడం, కాళ్ళు, చేతులు తిమ్మిర్లు, అరికాళ్ళు, అరిచేతులలో స్పర్శ కోల్పోవడం, చల్లని లేదా వేడి వస్తువులను గుర్తించలేకపోవడం, చేతుల నుండి వస్తువులు జారిపో వడం, చేతివేళ్ళు, కాళ్ళ వేళ్ళు వంకర్లు తిరగడం వంటి లక్షణాలు కలిగిన వారిని గుర్తించి వారికి సమీపంలోని వైద్య ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ చేయడం జరుగుతుందన్నారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు కుష్టు వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కుష్టు వ్యాధి గ్రస్తులకు ఆరోగ్య కేంద్రాలలోని ఆరోగ్య కార్యకర్త వద్ద యండిటి మందులను అందుబాటులో ఉంచి ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని వ్యాధి లక్షణలు ఉన్న వారు సద్వినియోగం చేసుకుని కుష్టు వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సహకరించాలన్నారు. జిల్లా కుష్టు నివారణ అధికారిణి డా. ఉషారాణి మాట్లాడుతూ జిల్లాలో కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వారికి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. ఆశ వర్కర్లు, మేల్ వాలంటీర్లు, ప్రతి ఇంటిని సందర్శించి వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి ఎఎన్ఎంలకు తెలియజేయడం జరుగుతుందన్నారు. లక్షణాలు ఉన్న వారి డేటాను ప్రత్యేక యాప్ ద్వారా వైద్య అధికారులకు అందజేస్తారన్నారు. వైద్యాధికారులు లక్షణాలు ఉన్నవారికి పరీక్షలు నిర్వహించి కుష్టు వ్యాధి నిర్ధారణ అయితే వ్యాధి తీవ్రతను బట్టి 6 నెల నుండి 12 నెలల వరకు ప్రతి నెల మందులను వైద్య సేవలను వ్యాధిగ్రస్తులకు ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 54 లెప్రసీ కేసులను గుర్తించడం జరిగిందని వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రా ద్వారా వైద్య సేవలు అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు. పోస్టర్లు, కరపత్రాల విడుదల కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మి నరసింహం, జిల్లా కుష్టు ఎయిడ్స్ టి.బి నివారణ అధికారిణి డా. జె. ఉషారాణి, డియంఅండ్‌హెచ్‌వో యం. సుహాసిని, డిఆర్‌డిఏ పిటి కె. శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# విద్యుత్ స్మార్ట్ మీటర్లు మాకొద్దు బాబోయ్..

**గుడివాడ, మేజర్ న్యూస్ :** టిడ్కో కాలనీలో స్మార్ట్ మీటర్లు పెట్టడానికి అంగీకరించేది లేదని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేసారు. కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో టిడ్కో కాలనీ వాసులు ఓవర్ హెడ్ ట్యాంక్ వద్ద 200 మంది వరకు గుమికూడి ధర్నా చేసారు. అనంతరం పెంచిన కరెంట్ బిల్లులను దగ్ధం చేసారు. ఈ సందర్భంగా టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ కార్యదర్శి బసవ అరుణ మాట్లాడుతూ టిడ్కో కాలనీ లో స్మార్ట్ మీటర్లు బిగించటానికి ఎవ్వరూ అంగీకరించటం లేదన్నారు. ప్రజల అభిష్టానికి వ్యతిరేకంగా స్మార్ట్ మీటర్లు పెట్టేందుకు చుస్తే అడ్డుకొని తీరతామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు నూరున్నిసా, ఉపాధ్యక్షులు శివారాంప్రసాద్, ఎస్.రాంబాబాబు, ఆర్.గణేశు, వీరస్వామి, రంగమ్మ మాధవి తదితరులు వార్డు నాయకులు పాల్గొన్నారు.



# ఆడపిల్లల సంరక్షణ లక్ష్యంగా చట్టాలు పటిష్టవంతంగా అమలయ్యేలా చూడాలి

### జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రీ కన్సెప్షన్ & ప్రీ నేటల్ డయాగ్నొస్టిక్ టెక్నిక్స్ యాక్ట్ అమలుకు సంబంధించి జిల్లాస్థాయి మల్టీ మెంబర్ అప్ప్రాప్రియేట్ అథారిటీ మీటింగ్ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సోమవారం కలెక్టరేట్లో జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం, ఆడపిల్లల సంరక్షణకై కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలు పట్టిష్టవం తంగా అమలయ్యేలా చూడాలని అన్నారు. ఆడపిల్లల సెక్స్ రేషియో తగ్గకుండా చూడాలని అన్నారు. స్కానింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, తనిఖీలు నిర్వహిం చాలని అన్నారు. దీనిలో భాగంగా అబార్షన్స్ ఎక్కడ ఎక్కువగా జరుగుతున్నాయి? ఆడపిల్లలు అని తెలిసినాక అబార్షన్స్ చేయిస్తున్నా రా? లేక స్టిల్ బర్త్ అబార్షన్స్ చేస్తున్నారా? డేకాయ్ ఆపరేషన్స్ నిర్వహించాల న్నారు. వివిధ ఆస్పత్రుల వారీగా ఆడపిల్లల అబార్షన్లు, మృత శిశువులను డెలివరీ అయిన కేసుల డేటా తీసుకొని విశ్లేషించి, ఆడపిల్లల సెక్స్ రేషియో తగ్గుటకు కారణాలు అన్వేషించాలన్నారు. ఓకే డాక్టర్ వివిధ ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందించే సందర్భంలో అట్టి డాక్టర్ల వారి డేటా కూడా సేకరించి విశ్లేషించాలన్నారు. తద్వారా వీటి నివారణకు సరైన చర్యలు తీసుకోవడానికి వీలవుతుందన్నారు. 10వ అదనపు జిల్లా జడ్జి చినబాబు మాట్లాడుతూ జనాభాలో స్త్రీ పురుష నిష్పత్తిలో ఎక్కువగా వ్యత్యాసాలు లేకుండా చట్టంలో నిబంధనలు, శిక్షలు పట్ల కళాజాతాల ద్వారా అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లాలో 4 కొత్త స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్ లకు, 3 కేంద్రాలలో మార్పులకు, ఒక కేంద్రం రెన్యువల్ కు సమావేశంలో ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో ఏఎస్పి వివి నాయుడు, డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ సర్మిష్ట,జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ప్రేమ్చంద్, అదనపు డిఎం అండ్ హెచ్ ఓ, జిల్లావైద్య శాఖ కార్యాలయ డెమో సిహెచ్ వాణిశ్రీ పాల్గొన్నారు.



## అఖిల భారతీయ కోలి సమాజ్ ఆంధ్రప్రదేశ్ నూతన అధ్యక్షులు పి.వి.ఎల్.యమ్ రాజుకు సత్కారం

**విజయవాడ మేజర్ న్యూస్ :** విజయవాడ గాంధీనగర్లోని ఎ.పి.ఎన్.జి.వొ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఇటీవల ఢిల్లీ రాజధాని లక్నోలో అఖిల భారతీయ కోలి సమాజ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేసి విజయవాడ నగరానికి విచ్చేసిన పశ్చిమ, కృష్ణ మాజీ ఎన్.జి.వొ నాయ కులు, నగర బి.సి వేదిక అధ్యక్షులు పి.వి.ఎల్.ఎన్.రాజును ఆంధ్రప్రదేశ్ ఎన్.జి.వొ ల సంఘ రాష్ట్ర అధ్యక్షులు కె. శివారెడ్డి, రాష్ట్ర ప్రదాన కార్యదర్శి ఎ.వి. సాగర్, కార్యవర్గ సభ్యులు సోమవారం సత్కారం చేసి అభినందనలు తెలియచేసారు. ప్రధాన కార్యదర్శి ఎ.వి. సాగర్ మాట్లాడుతూ దాదాపు 30 సంవత్సరాలుగా రాజు ఎ.పి.ఎన్.జి.లో అసోషియేషన్ పశ్చిమ కృష్ణ జిల్లా బ్రాంచికి తమ సేవలందించి, అనేక పోరాటాలలో పాల్గొన్నారు. భవిష్యత్తు లో ఇంకా ఉన్నత పదవులు అందుకోవాలని ఆకాంక్ష వెలిబుచ్చారు. ఈ సం దర్భంగా కోలి సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎల్.ఎన్ రాజు మాట్లాడుతూ ఎ.పి.ఎన్.జి.వొ రాష్ట్ర అధ్యక్షులు కె. శివరెడ్డికి, ప్రధాన కార్యదర్శి ఎ.వి. సాగర్‌కి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేసారు.

## గుడివాడ డిఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వి.ధీరజ్ వినీల్



**గుడివాడ మేజర్ న్యూస్ :** గుడి వాడ సబ్ డివిజన్ నూతన డిఎస్పీగా వి. ధీరజ్ వినీల్ సోమవారం మధ్యాహ్నం బాధ్యతలు చేపట్టారు. రాజేంద్రనగర్‌లోని డీఎస్పీ కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు చేపట్టిన ధీరజ్ వినిల్‌కు సబ్ డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్సైలు,, పోలీస్ అధికారులు పుష్పగుచ్చాలు అందిస్తూ స్వాగతం పలికారు.

## బందరు డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన చప్పిడి రాజా



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** బందరు డిఎస్పీగా చప్పిడి రాజా సోమవారం బాధ్యతలు స్వీకరిం చారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా చప్పిడి రాజా బందర్ సబ్ డివిజన్కు డిఎస్పీగా బదిలీ అయ్యారు. బాధ్యత స్వీకరించిన అనంతరం జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావును మర్యాదపూర్వకంగా కలిసిన డి.ఎస్.పి.బందర్ సబ్ డివిజన్ డిఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన చప్పిడి రాజాకు సబ్ డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్సైలు సాధర స్వాగతం పలికారు.

## అవనిగడ్డ డీఎస్పీగా తాళ్లూరి విద్యాశ్రీ



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** అవనిగడ్డ నూతన డిఎస్పీగా తాళ్లూరి విద్యాశ్రీ సోమవారం బాధ్య తలు చేపట్టారు. తణుకు గ్రామానికి చెందిన విజయశ్రీ బీటెక్ పూర్తి చేయడంతో మొదటి ప్రయత్నంలోనే రిక్రూట్ అయ్యి తొలి పోస్టింగ్ గా అవనిగడ్డ డిఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవనిగడ్డలో ప్రధాన సమస్యలు అయినా శాంతిభద్రతలు, ట్రాఫిక్, మత్తు పదార్థాలపై ప్రత్యేక దృష్టి పెట్టి అరికట్టేతందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆమె అన్నారు.

## ఆరోగ్య కేంద్ర సేవలు సద్వినియోగం చేసుకోండి



**ఏ.కొండూరు, మేజర్ న్యూస్ :** మండల ప్రాథ మిక ఆరోగ్య కేంద్ర సేవలు వినియోగిం చుకోవాలని వైద్యాధి కారులు స్వాతి, దివ్య లు పేర్కొన్నారు. స్థానిక ప్రాథ మిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం మహిళకు కాన్పు చేయించారు. ఈ సందర్భంగా వైద్యాధి కారులు మాట్లాడుతూ ఏ కొండూరు తండాలో ఎంఎల్‌హెచ్‌పిగా పనిచేస్తున్న వి.సుప్రియ తన రెండో కాన్పు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేయించుకొని ఆడబిడ్డకు జన్మనిచ్చిందన్నారు. అన్ని గ్రామాల ప్రజలు ఆరోగ్య కేంద్రం సేవలు వినియోగించుకోవాలని కోరారు. సేవలు అందించిన స్టాఫ్ నర్సులు ఎం.సుబ్బలక్ష్మి, మస్తాన్ బికు ప్రత్యేకంగా అభినందించారు.

## నిరుద్యోగులకు 12 నెలలు శిక్షణ ఇచ్చి ఉద్యోగం

### కమిషనర్ రమణబాబు



**నందిగామ, జనవరి 20, మేజర్ న్యూస్ :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వారి ఆదేశములనను సరించి ప్రధాన మంత్రి ఇంటర్న్ షిప్ ప్రోగ్రాం క్రింద నందిగామ పట్టణ పరిధిలోని 21 సం. నుండి 24 సం.ల లోపు నిరుద్యోగ యువతకు ఎస్ఎస్సి అర్హత తో మొదలు భారత దేశంలోనే అగ్ర శ్రేణి కంపెనీలలో 12 నెలల శిక్షణ ఇచ్చి తద్వారా వారికి ఉద్యోగ అవకాశము కల్పించుటకు సచివాలయముల వారీగా నందిగామ పట్టణంనకు 100 రిజిస్ట్రేషన్స్ పూర్తి చేయవలసినదిగా ఆదేశించియున్నారు. కావున నందిగామ పట్టణ పరిధిలోని 21 సం. నుండి 24 సం.ల లోపు నిరుద్యోగ యువత అందరూ కూడా మీ సచివాలయ పరిధి రిజిస్ట్రేషన్స్ చేయించుకొనవలసినదిగా కోరుచున్నాము. సదరు శిక్షణా కాలములో ఎంపికైన యువతకు రూ.6000లు స్టైపెండ్‌గా చెల్లించబడునని తెలియజేశారు. ఆదేవిధముగా సచివాలయ సిబ్బంది అందరూ కూడా మీ సచివాలయ పరిధిలో గల 21 నుండి 24 సం.ల లోపు నిరుద్యోగ యువత ను గుర్తించి మంగళవారం సచివాలయమునకు 10 చొప్పున కేటాయించిన 100 రిజిస్ట్రేషన్స్‌ను పూర్తిచేయవలసినదిగా తెలిపారు.

## ఆరు సంవత్సరాలుగా కోమాలో ఆయుష్



**నందిగామ, జనవరి 20, మేజర్ న్యూస్ :** పట్టణంలోని సీఎం రోడ్డులో ప్రభుత్వ ఆయుష్ విభాగానికి చెందిన యోగ ప్రకృతి వైద్యశాల విషయమై మాజీ ప్రభుత్వ వైద్య శాల సమస్యలను పరిష్కరించాలని డాక్టర్ భాను ప్రసాద్ అన్నారు. నాటి ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యగారు 16 సెంట్ల ప్రభుత్వ స్థలాని కేటాయించి,, 2018 ఏప్రిల్ పూనాడి వేసి శంకు స్థాపన చేశారు. 6 నెలల్లో పూర్తి చేసి ప్రజలకు వైద్యసేవలను అందుబా టులోకి తీసుకురావాలిసిన ఈ ప్రాజెక్ట్ 6 సంవత్సరాలుగా గ్రహణం పట్టి కోడి గట్టిన దీపంలా, నిర్రాణ వ్యవస్థలో ఉన్న ఈ ప్రాజెక్ట్ కు సంభంధించిన అధికారులతో సంప్రదించి, తక్షణమేపూర్తి చేసి యోగ, ప్రకృతి వైద్యశాల సేవలను ప్రజలకు అందుబాటు లోకి తీసుకురావలసిదిగా ఎమ్మెల్యే పూర్వ ఆయుష్ వైద్యాధికారి డా.కాపాభానుప్రసాద్, మాజి సైనిక సంఘ అధ్యక్షులు వాసిరెడ్డి వినతి పత్రం అందజేశారు.

## పశు సంవర్ధక సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి



**పెడన,మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని పాడిపశుపోషకులకు అత్యధిక ప్రాధాన్యతని ఇస్తుందని నియోజవర్గ శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు పెడన మండలం జింజెరు గ్రామంలో



ఏర్పాటు చేసిన పశు ఆరోగ్య శిబిరంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత మాట్లాడుతూ పశుపోషకులకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ తగిన నిధులు కేటాయిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఈ క్రమంలో పశువుల ఆరోగ్యానికి, ఉత్పాదకతను పెంచడానికి, వ్యాధులను నియంత్రించడానికి, పశుపోషణ ఖర్చులు తగ్గించడానికి, ఆర్థిక అండను కలగచేయడానికి వివిధ కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది అని పేర్కొన్నారు. పశు సంవర్ధక సేవలను పశుపోషకులకు మరింత చేరువ చేయడానికి 20-01-2025 నుండి 31-01-2025 వరకు అన్ని గ్రామలలో పశు ఆరోగ్య శిబిరాలు, అవగాహనా సదస్సులు నిర్వహించడం జరుగుతుంది అని తెలిపారు. మండల టిడిపి అధ్యక్షులు శలపాటి వీరప్రసాద్, ప్రధాన కార్యదర్శి సీరం ప్రసాదు, కూటమి ప్రభుత్వ నాయకులు,సచివాలయ సిబ్బంది, పశుసంవర్ధక శాఖ సిబ్బంది, ప్రభుత్వ అధికారులు తదితరులు ఉన్నారు.

# సహజ వనరుల వినియోగంలో కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలి






### మైనింగ్ రంగంలో కొత్త లక్ష్యాలతో ముందుకు సాగినపుడు మాత్రమే మెరుగైన ఫలితాలను సాధించే అవకాశం ఉంటుంది..

### రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** భువనేశ్వర్‌లో నిర్వహించిన నేషనల్ మైనింగ్ మినిస్టర్స్ సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. రాష్ట్రంలో మైనింగ్ రంగంలో ఉన్న అపార అవకాశాలు, క్రిటికల్ మైనింగ్ ఆవశ్యకతను గురించి మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, దేశస్థాయిలో మైనింగ్ శాఖల సదస్సుల ద్వారా రాష్ట్రాలు తమ సూచనలను, పాలసీలను, అవసరాలను, ఆకాంక్షలను పరస్పరం పంచుకోవడానిక అవకాశం కలుగుతుంది. ప్రధాన మంత్రి ఖనిజ క్షేత్ర కళ్యాణ్ యోజనకార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో మైనింగ్ ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాల పెంపునకు, యువతలో నైపుణ్యాభివృద్ధికి చర్యలు తీసుకునే అవకాశం లభిస్తోంది. డీఎంఎఫ్ ద్వారా రాష్ట్రంలోని ప్రజల జీవన ప్రమాణాల పెంపు సహా సమగ్రాభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ముందంజలోఉంది-భారతదేశం గత 75 సంవత్సరాల్లో స్టీల్, సిమెంట్, అల్యూమినియం వంటి అనేక ఉత్పత్తుల్లో మెరుగైన స్థానాన్ని సంపాదించుకుంది.ఇనుప ఖనిజం, బాక్సైట్, లైమ్ స్టోన్ లాంటి లాంటి కీలక మినరల్స్ ఎగుమతిలో తమదైన ముద్ర వేసుకున్నాం-ప్రస్తుతం మారిన కాలానికి అనుగుణంగా సోలార్, విండ్,సెమీ కండక్టర్స్ లాంటి రంగాల్లో మనం ముందంజ వేయాల్సిన సమయం వచ్చింది. అందుకోసం క్రిటికల్ మినరల్స్ ఉత్పత్తి,ప్రాసెసింగ్ పై దృష్టి సారించాలి. తద్వారా దిగుమతులపై, ఆధారపడాల్సిన అవకాశం తగ్గుతంది.పర్యావరణ పరిరక్షణ, క్రిటికల్ మైనింగ్ రంగంలో స్వయం సమృద్ధి సాధించడానికి పట్టణ మైనింగ్ పై కూడా దృష్టి పెట్టాలి.రీ సైక్లింగ్ సహా కీలకమైన ఖనిజాల విభాగాల్లో అవగాహన కల్పించడం, కొత్త ఆవిష్కరణలనుప్రోత్సహించడం ప్రస్తుతం అత్యంత అవసరం.ఏప్రిల్ 2024లో న్యూ ఢిల్లీలో జరిగిన క్రిటికల్ మినరల్స్ సమ్మిట్ మాదిరిగా కేంద్ర ప్రభుత్వం ప్రాంతీయ వర్క్ షాపులను నిర్వహించాలని కోరుతున్నాను.క్రిటికల్ మినరల్స్ గుర్తింపు, వెలికితీత, ప్రాసెసింగ్‌పై లోతైన అవగాహన విషయంలో ఈ వర్క్ షాపులు విద్యార్థులు, టీచింగ్ కు ఉపయోగపడతాయి. అటువంటి షాపులను నిర్వహించేందుకు అవసరమైన సహాయ సహకారాన్ని అందించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. మా యొక్క ఈ ప్రయత్నాన్ని విజయవంతం చేయడానికి గనుల మంత్రిత్వ శాఖ సహాయ సహకారాలు అందించాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాను. నోటిఫైడ్ ప్రైవేట్ ఎక్స్‌ప్లోరేషన్ ఏజెన్సీ దేశంలో ఖనిజాన్వేషణకు అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయం. అయితే సరైన విజన్ లేకపోవడం,ముందుగా గుర్తించకపోవడం కారణంగా,రాష్ట్ర ప్రభుత్వాలు ఇబ్బందులు, ఎదుర్కొంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించేలా వనరుల నిర్వహణకు సంబంధించిన సమాచారం అందించేలా ఎన్‌పీఈఏలను తప్పనిసరి చేయాలని గనుల మంత్రిత్వ శాఖను కోరుతున్నా. క్రిటికల్ మినరల్స్‌పై నివేదికలను విశ్లేషించేందుకు అవసరమైన మానవ వనరులు లేకపోవడంతో రాష్ట్ర డీఎంజీలు అనేక ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నాయి. అందువలన రాష్ట్ర డీఎంజీ అధికారులకు ప్రాక్టికల్ ఫీల్డ్ సెషన్‌లతో సహా జీఎస్ఐ శిక్షణా సంస్థ రెగ్యులర్ శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలని నేను కోరుతున్నాను. ఈ కార్యక్రమాలు క్రిటికల్ మినరల్స్ గుర్తింపు, వాటి నిర్వహణకు తోడ్పాటు అందిస్తుంది.గనుల శాఖను బలోపేతం చేయడం, సవాళ్లను అధిగమించడం, అన్వేషణ, ఉత్పత్తి అవకాశాలను అందిపుచ్చుకోవడంలో కేంద్ర మైనింగ్ శాఖతో కలిసి పని చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది.భారతదేశ మైనింగ్ రంగాన్ని మరింత ఉన్నత శిఖరాలకు నడిపించడంతో పాటుగా సుస్థిరమైన అభివృద్ధి సాధించడం ద్వారా వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మనస్ఫూర్తిగా,తెలియజేస్తున్నానని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.

## చల్లపల్లి గ్రామానికి స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమం వరం



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** చల్లపల్లి గ్రామానికి స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమం వరం అని సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి అన్నారు. స్వచ్ఛ సారధులు డాక్టర్ డిఆర్ కె.ప్రసాద్, డాక్టర్ పద్మావతి తరపున లోక్నాయక్ పురస్కారాన్ని అందుకున్న స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్త, విశ్రాంత ఉపాధ్యాయులు ప్రాతూరి శాస్త్రిని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కృష్ణకుమారి మాట్లాడుతూ, గతపదేళ్లుగా స్వచ్ఛ సారధుల ఆధ్వర్యంలో స్వచ్ఛ కార్యకర్తలు అందిస్తున్న సేవలతో గ్రామ రూపురేఖలు మారిపోయాయన్నారు. వారి కృషితో స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమానికి దేశస్థాయిలో సముచిత గుర్తింపు, గౌరవం లభిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో పివి. మాధవేంద్రరావు, డాక్టర్ మాలెంపాటి గోపాలకృష్ణయ్య, స్వచ్ఛ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌కు ఆహ్వానం



**పెడన,మేజర్ న్యూస్:** దేవాంగ కులస్తుల కులదైవం శ్రీమత్ చౌడేశ్వరి దేవి జ్యోతిర్లింగ మహోత్సవాలు ఫిబ్రవరి 10, 11,12,13, తారీకులలో జరుగుతాయని ఈ కార్యక్రమాలకు తప్పక హాజరు కావాలని మున్సిపల్ చైర్ పర్సన్ పథకం నాగకుమారి ప్రసాద్, కమిషనర్ ఎం గోపాల్ రావును ఉత్సవ కమిటీ సభ్యులు కరపత్రాన్ని ఇచ్చికోరారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ చాంబర్‌లో, కమిషనర్ ఛాంబర్‌లో వారిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. అంతేగాక ఆ యొక్క మహోత్సవాలకు పురపాలక సంఘం తరఫున తాగునీరు, పారిశుద్ధ్య కార్యక్రమాలకు, సహకరించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఉన్నారు.

## స్వచ్ఛ చల్లపల్లిని సందర్శించిన డైరెక్టర్ రాఘవేంద్రరావు కుటుంబసభ్యులు



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** ప్రముఖ సినీ దర్శకులు కె.రాఘవేంద్రరావు కుటుంబ సభ్యులు స్వచ్ఛ చల్లపల్లిని సోమవారం సందర్శించారు. హైదరాబాద్ సన్షైన్ హాస్పటల్స్ ఎండి డాక్టర్ ఎవి. గురవారెడ్డి ద్వారా స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమం గురించి తెలుసుకున్న రాఘవేంద్రరావు వదిన వాణి, ఆమె సోదరి వీణలు ఇరువురూ చల్లపల్లి వచ్చారు. సోమవారం తెల్లవారుజామున 3359వ రోజు స్వచ్ఛ సేవలో స్వచ్ఛ కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు. పదేళ్ల స్వచ్ఛ చల్లపల్లి ప్రస్థానాన్ని తెలుసుకుని స్వచ్ఛచల్లపల్లికి నాయకత్వం వహించిన డాక్టర్ డిఆర్ కె.ప్రసాద్, డాక్టర్ పద్మావతి దంపతులను, వారి అడుగులో అడుగులు వేస్తూ గ్రామ పరిశుభ్రతకు కృషిచేస్తున్న స్వచ్ఛ కార్యకర్తలను అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, స్వచ్ఛ కార్యకర్తలు తదితరులున్నారు.

## ఎమ్మెల్యే కాగితకు ఆహ్వాన పత్రికను అందించిన శ్రీమత్ చౌడేశ్వరి దేవి ఉత్సవ కమిటీ



**పెడన, మేజర్ న్యూస్:** దేవాంగ కుల దైవం శ్రీమత్ చౌడేశ్వరి దేవి జ్యోతిర్లింగ మహోత్సవాలు ఫిబ్రవరి 10,11,12,13, తేదీలలో జరుగు సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ను ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికను అందించామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఆయన పార్టీ కార్యాలయము ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేలు కలిసి ఆహ్వానించారు. ఫిబ్రవరి నెలలో జరగబోయే దేవాంగ కులస్తుల శ్రీమత్ చౌడేశ్వరి దేవి జ్యోతిర్లింగ మహోత్సవాలు అన్ని కార్యక్రమాలలో పాల్గొనాలని ఎమ్మెల్యేను కోరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పెట్రోలు బంకు, సినిమా థియేటర్లను తనిఖీ చేసిన తహసీల్దార్





**కంచికచర్ల మేజర్ న్యూస్ :** ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని తహసీల్దార్ జాహ్నవి సూచించారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తహసీల్దార్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పేషంట్లకి అవసరమైన అన్ని సదుపాయాలు ఉన్నాయా, సరిపడా సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా లేదా వారి డ్యూటీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. తప్పనిసరిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వచ్చే పేషెంట్లు కోసం సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాత్రి సమయంలో కూడా తప్పనిసరిగా డ్యూటీలో ఉండాలని సిబ్బందికి తెలియజేశారు. అనంతరం కంచికచర్లలో ఉన్న పెట్రోల్ బంకుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలు ఆయిల్ బంకులో ఆయిల్ ఫిల్లింగ్ కరెక్ట్ గా జరుగుతుందా లేదా తనిఖీ నిర్వహించారు. వినియోగదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని బంకు యాజమాన్యానికి సూచించారు. అనంతరం స్థానిక సినిమా హాలల్లో నియమ నిబంధనలు పారిశుధ్యం పాటిస్తున్నారా లేదా అని తనిఖీలు నిర్వహించారు. సినిమా థియేటర్లో ప్రభుత్వ నిబంధనలకు అనుకూలంగా ఫైరు, సిట్టింగ్ కెపాసిటీ టికెట్ల ధర వివరాలు పరిశీలించారు. ఆయిల్ బంకుల్లో సినిమా థియేటర్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠినమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. థియేటర్లో టికెట్ ధర ప్రభుత్వ నిర్ణయించిన ధరలకే అమ్మాలని అంతకుమించి టికెట్లు ధర పెంచి అమ్మితే థియేటర్ యజమానిపై చర్ల తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వీఆర్వో ఆర్ఐ రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గిత్త దూడ రవాణాకు అడ్డుకున్న పోలీసులు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** గిత్త దూడను గోవధ శాలకు తరలిస్తుండగా విషయం తెలుసుకున్న బెజవాడ ధన సురేష్ అనే వ్యక్తి గవర్నమెంట్ హాస్పిటల్ సమీపంలో గిత్త దూడను అక్రమ రమాణా చేస్తున్న ఆటోను అడ్డుకొని వందకు సమాచారం ఇచ్చారు. దీనితో పోలీసులు రంగ ప్రవేశం చేసి విచారణ చేయగా నాగాయలంక మండలంలోని ఏటిమొగ గ్రామానికి చెందిన బాలరాజు గిత్త దూడను విక్రయించగా గుడివాడకు చెందినవారు కొనుగోలు చేసి తరలిస్తుండగా ఎస్సై శ్రీనివాస్ అక్రమ రవాణాగా గుర్తించి గిత్తదూడను పెద్ద ముత్తేవి గోశాలకు తరలించినట్లు తెలిపారు. సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

## సమాదుల దొడ్డికి రక్షణ కల్పించండి



**గుడివాడ, మేజర్ న్యూస్:** గుడివాడ 1వ వార్డులోని నాగవరప్పాడుకు సమీపంలోని చంద్రయ్య డ్రెయిన్ ప్రక్కన ఉన్న 2ఎకరాల సమాదుల దొడ్డి 3 వంతులు అక్రమణకు గురి అవడంతో చనిపోయిన క్రైస్తవులు, దళితుల సమాదులకు స్థలం సరిపోక అనేక ఇబ్బందులకు గురి అవుతున్నట్లు దళిత నాయకులు, క్రైస్తవులు పేర్కొన్నారు. తక్షణమే ఈ ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేస్తూ దళిత నాయకులు సింగవరుపు జోసప్, దారం కరుణాకర్, రాచూరి రాజు, చొప్పల జోషిలు సోమవారం ఆర్డివో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగవరపాడు సమీపంలోని చంద్రడ్రైయిన్ అనుకుని ఉన్న దళిత, క్రైస్తవులు సమాదులు వద్ద ఉన్న కొద్దిపాటి ఖాళీలను సైతం కొంత మంది గడ్డివాములు పెట్టి ఆక్రమించడం జరిగిందన్నారు. గతంలో మున్సిపల్, రెవెన్యూ అధికారులకు అనేక సార్లు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ప్రజా ప్రతినిధులకు సైతం తెలియజేయడం జరిగిందన్నారు. అయినప్పటికీ ఎవరూ స్పందించి, చర్యలకు ముందుకు రాలేదన్నారు. సమాధుల కోసం నూతనంగా స్థలాన్ని కొనుగోలు చేయాల్సిన అవసరం ఏర్పడుతుందని, ఆ పరిస్థితి రాకుండా ఆక్రమణలు తొలగించి ప్రహరీ నిర్మించాలని కోరారు. అనతరం ఆర్డివో కార్యాలయం ఏఓకు వినతి ప్రతాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు మహేష్, సి. హెచ్ సువర్ణరాజు, రవూరి చిన్నా, ఏసుపాదం, బాలరాజు, జయరాజు, రాజమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇరువురు యువకులు దుర్మరణం







**పామర్రు డిసెంబర్ 20 మేజర్ న్యూస్:** పామర్రు నియోజకవర్గం పరిధిలోని పమిడిముక్కల మండలం మంటాడ పంచాయతీ పరిధిలో కెసిపి ఫ్లైఓవర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు సంఘటన స్థలంలోనే మృతి చెందారు. సేకరించిన వివరాల ప్రకారం కాకినాడ జిల్లాకు చెందిన దాసరి నిమ్స్ చంద్రం(23), ముక్త దుర్గ బాబు (24)లు మోటార్ సైకిల్ పై వెళుతుండగా అదుపుతప్పి కెసిపి సమీపంలో ఫ్లైఓవర్ గోడను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇరువురు అక్కడికక్కడే మృతి చెందారు. వీరు స్వగ్రామం నుండి మోటార్ సైకిల్ పై హైదరాబాద్ వెళుతుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పమిడిముక్కల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

## నేటి నుండి రాజధాని అమరావతికి ప్రత్యేక ఆర్టీసీ సర్వీస్



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** అవనిగడ్డ నుండి రాజధాని అమరావతి కి అవనిగడ్డ ఆర్టీసీ డిపో నుండి ఎక్స్ప్రెస్ సర్వీస్ నడపనున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ కే హనుమంతరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ కృషితో అవనిగడ్డ ఆర్టీసీ డిపో నుండి రాజధాని అమరావతికి (వైకుంటపురం) నూతన ఎక్స్ప్రెస్ బస్సును మంగళవారం ఉదయం ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ప్రతిరోజు ఉదయం 6 గంటలకు నాగాయలంకలో బయలుదేరి 6:30 నిమిషములకు అవనిగడ్డ నుండి బయలుదేరి వైకుంటపురం (అమరావతి) వెళ్లి తిరుగు ప్రయాణంలో వైకుంఠపురం నుండి ఉదయం 10 15 నిమిషాలకు, సాయంత్రం 5.30 నిమిషములకు బయలుదేరి అవనిగడ్డ వచ్చే విధముగా ఏర్పాటు చేయడం జరిగిందని ప్రయాణికులు ఈ సర్వీసును సద్వినియోగం చేసుకొని ఆదరించాలని హనుమంతరావు కోరారు.



## గన్నవరం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ

### రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న వైద్యం పై ఆరా..

**గన్నవరం, జనవరి 20, మేజర్ న్యూస్ :** గన్నవరం సామాజిక ఆరోగ్య కేంద్రంను వంద పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందిస్తున్న సేవల పై ఆరా తీశారు. రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న వైద్యం, సిబ్బంది తీరు గురించి తెలుసుకున్నారు. అంతర్జాతీయ విమానశ్రమకు చెరువులో ఉన్న ఈ ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా చేయాలని ఇప్పటికే పలు మార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకుని వెళ్లిన విషయాన్ని గుర్తు చేశారు. వచ్చే బడ్జెట్లో నిధులు కేటాయించే అవకాశం ఉందని అన్నారు. అవసరమైన మరమ్మతులు, ఎలక్ట్రికల్ పనులను తక్షణమే చేయాలని ఆదేశించారు. ప్రజలకు రక్తపరీక్షలు చేయాలనీ తద్వారా విషజ్వరాలు, అతిసారం వంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త పడవచ్చునని సూచించారు. ఆసుపత్రి పరిసర ప్రాంతాలలో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని ఎలాంటి చెత్త లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే యార్లగడ్డ సూచించారు.

## జీవ నియంత్రణ పద్ధతులపై ఆరు రోజులు శిక్షణ




**ఘంటసాల, మేజర్ న్యూస్:** ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల ప్రాంగణములో జీవ నియంత్రణ పద్ధతులతో చీడపీడల యాజమాన్యం పై 6 రోజుల నైపుణ్యత శిక్షణా కార్యక్రమం సోమవారం నాడు కేవికె సమన్వయ కర్త డా. సుధారాణి అధ్యక్షతన నిర్వహించారు. సమగ్ర యాజమాన్య పద్ధతులలో భాగంగా జీవ నియంత్రణ పద్ధతులను అవలంభించడం వలన రైతులు తక్కువ ఖర్చుతో చీడ పీడలను నియంత్రించుకుంటూ నాణ్యమైన రసాయన అవశేష రహిత పంట ఉత్పత్తులను సాధించవచ్చు అని, పెట్టుబడి ఖర్చు తగ్గించుకుని అధిక నికర ఆదాయం పొందొచ్చు అని సుధా రాణి తెలిపారు. కృష్ణా జిల్లా లోని పలు ప్రాంతాలలో గ్రామీణ యువత కు ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. జీవ నియంత్రణ లో భాగంగా ట్రైకోడర్మ, సూడోమోనాస్ ఉత్పత్తి, ట్రైకోగ్రామ పరాన్నజీవి ఉత్పత్తి వంటి అంశాల పైన శిక్షణా తరగతులు సస్యరక్షణ శాస్త్రవేత్త డా. రేవతి నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమానికి ఘంటసాల గ్రామ సర్పంచ్ వేంకటేశ్వరమ్మ, జిల్లా వనరుల కేంద్రం డిడిఏ జ్యోతి రమణి, శ్రీనివాస్, పద్మజ, వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త లహరి, కేవీకే శాస్త్రవేత్తలు మంజువాణి, యశ్వంత్, వెంకటలక్ష్మి, నవీన్, కృష్ణవేణీ, గ్రామీణ యువత పాల్గొన్నారు.

## రీ సర్వే పై అవగాహన ర్యాలీ



**ఘంటసాల మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని వేములపల్లి గ్రామంలో తహసీల్దార్ బి విజయప్రసాద్ అధ్యక్షతన రీ సర్వేపై ర్యాలీ బందర్ ఆర్డీవో స్వాతితో కలిసి నిర్వహించారు ఘంటసాల మండలం వేములపల్లి గ్రామంలో ఏపీ రీ సర్వే ప్రాజెక్టు గ్రామ సభ సోమవారం నిర్వహించారు. ఈ సభకు హాజరైన ఆర్డీవో స్వాతి సర్వే జరుగుతున్న వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతులు అడిగిన పలు ప్రశ్నలకు సమాదానం ఇచ్చారు. అనంతరం ఆర్డీవో స్వాతి మాట్లాడుతూ వేములపల్లి గ్రామంలో 612 ఎకరాల భూములు ఉండగా మూడు బృందాలుగా సర్వే చేస్తున్నట్లు చెప్పారు. రీ సర్వేకి సంబంధించి రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చిన రైతులు సర్వేలో పాల్గొనాలని, వారికి సంబంధించిన పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డు, ఫొటో తీసుకొచ్చి సర్వేయర్లకు అందించాలన్నారు. రీ సర్వేలో పాల్గొనే సిబ్బంది సమర్ధవంతంగా విధులు నిర్వహించాలన్నారు. అనంతరం రీ సర్వే పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.విజయ ప్రసాద్, రీ సర్వే డీటీ పి.శ్రీనివాసరావు, ఆర్వ కె.శ్రీనివాస్, మండల సర్వేయర్ వల్లీ పుష్ప, వీఆర్వో, సర్వేయర్లు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్





**మొవ్వ (జనవరి 20) మేజర్ న్యూస్:** సోమవారం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు వర్ల కుమార్ రాజాతో కలిసి మొవ్వ మండలంలోని మొవ్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజు భోజనం సిద్ధం చేస్తున్నదీ లేనిదీ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో వారు విద్యార్థులతో కలిసి భుజించారు. తొలుత వారు పాఠశాలలో కలియతిరిగి విద్యార్థులకు వంట చేసే ప్రదేశాన్ని, తాగునీటి వసతి, అదేవిధంగా గణితం, కంప్యూటర్ ల్యాబ్ లను పరిశీలించారు. వంట గది ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, తాగునీటి ట్యాంకులను తరచుగా శుభ్రపరచాలని సూచించారు. పాఠశాలలో ఉత్తీర్ణత నూరు శాతం సాధించాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, ఇతర అధికారులు కలెక్టర్‌తో పాటు ఉన్నారు.

# సెపక్ తక్రా జాతీయ పాఠశాల క్రీడలను విజయవంతం చేయాలి



**విజయవాడ మేజర్ న్యూస్ :** అధికారులు సమన్వయంతో సెపక్ తక్రా జాతీయ పాఠశాల క్రీడలను విజయవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం. లక్ష్మీ నరసింహం అన్నారు.

కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం సెపక్ తక్రా అండర్ - 14 బాలురు / బాలిక జాతీయ పాఠశాల క్రీడల నిర్వహణపై అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెపక్ తక్రా జాతీయ పాఠశాల క్రీడలను ఈనెల 24వ తేదీ నుండి 27వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు స్థానిక పటమట కోనేరు బసవయ్య చౌదరి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. క్రీడలను విజయవంతం చేసేందుకు విద్యాశాఖకు చెందిన పాఠశాల హెచ్‌యంలు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు, నగర పాలక సంస్థ, పోలీస్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య కమిటీ సభ్యులు సమన్వయంతో ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ క్రీడలకు 12 రాష్ట్రాల నుండి క్రీడాకారులు హాజరు కానున్నారని టోర్నమెంట్ విజయవంతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని డిఆర్‌వో లక్ష్మీ నరసింహం ఆదేశించారు. అనంతరం సెపక్ తక్రా జాతీయ పాఠశాల క్రీడలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సమావేశంలో జిల్లా విద్యా శాఖ అధికారి సుబ్బారావు, స్టేట్ స్కూల్ గేమ్స్ సెక్రటరి బానుమూర్తి రాజు, డిస్ట్రిక్ట్ స్కూల్ గేమ్స్ సెక్రటరి శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

# అగ్ని ప్రమాద బాధితులను అన్నివిధాలుగా ఆదుకుంటాం



**గుడ్లవల్లేరు మండలంలో అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించి, నిత్యవసరాలు పంపిణీచేసిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము**

**గుడివాడ మేజర్ న్యూస్:** అగ్ని ప్రమాద బాధితులను అన్నివిధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అభయమిచ్చారు. వడ్లమన్నాడు గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన 4బాధిత కుటుంబాలను గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సోమవారం ఉదయం పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాద కారణాలను రెవిన్యూ అధికారులు ఎమ్మెల్యే రాముకు వివరించారు. పూర్తిగా దగ్ధమైన 2 ఇళ్లను పరిశీలించి ఈ ప్రమాదంలో తీవ్రంగా నష్టపోయిన నత్త సుబ్బారావు, జంగం నాగేంద్రరావు, జంగం శ్రీనివాసరావు, మాసువరపు రోశయ్య, కుటుంబాలకు ధైర్యం చెప్పారు. తక్షణ సహాయంగా నిత్యవసార సరుకులను ఎమ్మెల్యే వారికి అందచేశారు. ప్రభుత్వం నుండి అందాల్సిన పరిహారం సత్వరం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బాలాజీ, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవితో ఫోన్లో మాట్లాడారు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని కూడా భరోసా ఇచ్చారు. ప్రభుత్వ సహకారానికి తోడు, దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి తమ వంతు సాయం అందించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం, కొడాలి రామరాజు, వాసే మురళి, సర్పంచ్ కటికల జ్యోతిలత, ఉప సర్పంచ్ గరికపాటి రాంబాబు, కూటమి నేతలు గరికపాటి వెంకటేశ్వరరావు, పెన్నేరు రమేష్ బాబు, మాదా శ్రీనివాసరావు, తోట చిన్నారి, పామర్తి సూరిబాబు, గుడిసెల రమేష్, కడప బాబి, కటకం కొండ, తోము వెంకటరత్నం, మల్లీ, కనకం పెద్దిరాజులు, గడ్డం నిరంజన్ రావు, మండ మురళి నాంచారయ్య, తాసిల్దార్ లోకరాజు, ఎంపిడిఓ సారధి, రెవెన్యూ, విద్యుత్ శాఖ ఉద్యోగులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.





## కృష్ణానది పరిసర ప్రాంతాలను పరిశీలించిన దర్శకుడు బోయపాటి శ్రీనివాస్

**చందర్లపాడు, జనవరి 20, మేజర్ న్యూస్ :** మండలంలోని గుడిమెట్ల గ్రామం వద్ద కృష్ణానది పరిసర ప్రాంతాలను ప్రముఖ దర్శకుడు బోయపాటి శ్రీనివాస్ పరిశీలించారు. అఖండ-2 సినిమా సన్నివేశాల చిత్రీకరణలో భాగంగా ఈ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. కృష్ణా నదిలో పడవపై ప్రయాణించి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. సినిమా షూటింగ్‌కు ఈ ప్రాంతం అనువుగా ఉందో లేదో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అఖండ మూవీ యూనిట్, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి రెడ్ రన్ పోటీలకు నరేష్‌కు రెండవ బహుమతి




**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి నుండి హెచ్ఐవి నివారణలో భాగంగా అందరికీ అవగాహన కల్పించాలని గత అక్టోబరు నెలలో రెడ్ రన్ కార్యక్రమం నిర్వహించారు. అందులో గెలుపొందిన విజేతలను గోవాలో ఈ నెల 18న జరిగిన జాతీయస్థాయి రెడ్ రన్ పోటీలకు పంపించారు. అందులో ఎం.నరేష్ రెండవ బహుమతిని ట్రాన్స్ జెండర్ కేటగిరీలో గెలుపొందారు. డాక్టర్ ఏ. సిరి ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి చేతుల మీదుగా 35000. బహుమతి నీ మెమోంటో ను అందించారు. డాక్టర్ సరస్వతీ దేవి ఏపీడీ, డాక్టర్ టి. మంజుల జేడీ ఐఈసీ డాక్టర్ కామేశ్వర ప్రసాద్, జీడీ బీఎస్సడీ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ అభినందనలు తెలియచేశారు.

## ముమ్మరంగా జరుగుతున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియ



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల నూతన భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో జరుగుతున్న బీఫామ్ పట్ట రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముమ్మరం గా జరుగుతోందని ఇన్చార్జ్ కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ అన్నారు. పాయికాపురం, కొత్త రాజరాజేశ్వరి పేటలో 10 సంవత్సరాలు నిండిన ఇంటి యజమానులకు బి ఫాం పట్టాను పక్క రిజిస్ట్రేషన్ చేసేందుకు విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముమ్మరంగా జరుగుతుందని, ఇంకాను రిజిస్ట్రేషన్ జరగవలసినవి 1171 ఉండగా, అందులో 371 రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశారని తెలిపారు. ఇంకాను ఎవరైతే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చెయ్యాలో త్వరగా పూర్తిచేసుకుని ప్రభుత్వం వారు కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ప్రజలను కోరారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999